www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 29 మే 2021 | సంపుటి : 02 | సంచిక :314 | పేజీలు : 4 | వెల : రూ 3-00



## అవన్ని అబద్దాలు..నమ్మొద్దు..: ఆనందయ్య

నెల్లూరు జిల్లా: టీవీల్లో, వాట్సాప్‌లలో కరోనాకు మందు శుక్రవారం ఇస్తున్నారని ప్రకటనలు చేస్తున్నారని అవన్ని అబద్దాలని, వాటిని నమ్మొద్దని ఆనందయ్య చెబుతూ ఓ వీడియో పోస్టు చేశారు. మందు తయారు చేయడం నిలిపివేశామని, మందు తయారు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదన్నారు. పర్మిషన్ ఇచ్చిన వెంటనే మందు తయారు చేసి అందరికీ అందుబాటులోకి తీసుకువస్తాన్నారు. ప్రస్తుతం మందు తయారీకి తనవద్ద వనమూలికలు, ద్రవ్యాలు లేవన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే తాను టీవీ ప్రకటన చేసి.. మందు తయారు చేసి అందరికీ సరఫరా చేస్తానని ఆనందయ్య స్పష్టం చేశారు.

# యాస్ తుపాను బలహీనపడింది!

**తీరం దాటిన తర్వాత బలహీనపడి వాయుగుండంగా మార్పు**

**నైరుతి రుతుపవనాల నేపథ్యంలో రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు**



హైదరాబాద్/ న్యూఢిల్లీ: యాస్ తుపాను గురువారం బలహీనపడి వాయుగుండంగా మారినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది ఇంకా బలహీనపడి తీవ్రత తగ్గుతుందని వివరించింది. ప్రస్తుతం జార్ఖండ్, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైనట్లు సూచిస్తూ, దీని ప్రభావం తెలంగాణపై పెద్దగా లేదని స్పష్టం చేసింది. నైరుతి, తూర్పు మధ్య బంగాళాఖాతంలో పూర్తిగా, ఆగ్నేయ బంగాళాఖాతంలో చాలాభాగం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొంతభాగం వరకు బలమైన గాలులు ప్రవేశించాయని వివరించింది. రాష్ట్రానికి పశి?చమ, వాయవ్య దిశల నుంచి బలమైన గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 31న కేరళలో నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయానికి పరిస్థితులు అనుకూలంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడతాయని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. అలాగే శని, ఆది, సోమవారాల్లో తెలంగాణలో భారీ వర్షాలు, ఏపీలో ఓ మాదిరి వానలు పడతాయని వివరించింది. ఇక రాష్ట్రంలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. నల్లగొండలో గరిష్ట ఉష్ణోగ్రత 43.5 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, మెదక్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 22.7 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.

# జలవనరుల శాఖపై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పోలవరం సహా ప్రాధాన్యత ప్రాజెక్టుల నిర్మాణ ప్రగతిపై అధికారులతో చర్చించారు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో ప్రగతిని అధికారులు సీఎంకు వివరించారు. 91 శాతం స్పిల్‌వే కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని.. జూన్ 15 నాటికి మిగిలిన పనులు పూర్తిచేస్తాం అని అధికారులు తెలిపారు. ఈ నెలాఖరుకు స్పిల్ ఛానల్ పనులు పూర్తవుతాయని వెల్లడించారు. ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీలను పూర్తిచేశామని.. జూన్ నెలాఖరుకు కాఫర్ డ్యామ్‌లో 1, 2 రీచ్‌లు పూర్తవుతాయన్నారు అధికారులుజులై ఆఖరుకు కాఫర్ డ్యామ్ 3, 4 రీచ్ పనులు నిర్ణీత ఎత్తుకు పూర్తి అవుతాయని తెలిపారు. దిగువ కాఫర్ డ్యాం పనులు కూడా వేగవంతం చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన పోలవరం బిల్లుల చెల్లింపుపై సీఎం వైఎస్

**పోలవరం సహా ప్రాధాన్యత ప్రాజెక్టుల నిర్మాణ ప్రగతిపై చర్చ**

**పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో రూ. 1600 కోట్ల బిల్లులు**

జగన్ సమీక్ష నిర్వహించారు. 1600 కోట్ల రూపాయల బిల్లులు వేర్వేరు దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు సీఎం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ.. "పోలవరం ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టు. యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తిచేయాలనే తలంపుతో ఉన్నాం. అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముందుగా డబ్బులు ఇస్తున్నాం. ప్రాజెక్టు ఫలాలు వీలైనంత త్వరగా అందించాలనే తపనతో ఉన్నాం. ఆర్థికంగా క్లిష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ కూడా.. ప్రాజెక్టు పట్ల సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతున్నాం అని సీఎం జగన్ తెలిపారు. "రాష్ట్ర ప్రభుత్వం నుంచి చేసిన ఖర్చుకు సంబంధించి ..కేంద్రంలో బిల్లులు పెండింగులో ఉండడం సరికాదు . అధికారులు వెంటనే దీనిపై దృష్టిపెట్టాలిచేసిన ఖర్చు వెంటనే రీయింబర్స్ అయ్యేలా చూడాలి. వచ్చే మూడు నెలలకు కనీసం 1400 కోట్ల రూపాయలు ఖర్చు అని అధికారులు చెప్తున్నారు. ఢిల్లీ వెళ్లి పెండింగ్ బిల్లులు క్లియర్ అయ్యేలా చూడాలి"అని సీఎం జగన్ ఆదేశించారు. వంశధారపై నేరడి బ్యారేజీ నిర్మాణంపైనా దృష్టిపెట్టాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. నేరడి బ్యారజీ నిర్మాణాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే చర్చలకు ఒడిశా సీఎస్‌కు లేఖరాశామని..వారి స్పందన కోసం ఎదురుచూస్తున్నామన్న సీఎస్ ఆదిత్యనాథ్.. త్వరలోనే నేరడి బ్యారేజీకి సంబంధించి ఒడిశాతో మాట్లాడతామని సీఎస్ తెలిపారు. నెల్లూరు బ్యారేజీ నిర్మాణం జూలై 31 నాటికి పూర్తవుతుందని అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. సంగం బ్యారేజీ పనులు 84 శాతం పూర్తయ్యాయని.. జులై 31 నాటికి మొత్తం పనులు పూర్తవుతాయని అధికారులు వెల్లడించారు. అవుకు టన్నెల్‌లో రెండువైపుల నుంచి పనులు చేస్తున్నామని.. ఇంకా 180 మీటర్ల పని ఉందని..వచ్చే 3 నెలల్లో పనులు పూర్తిచేయగలుగుతామని అధికారులు సీఎంకు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టులో టన్నెల్ ?1 పూర్తిగా సిద్ధమైందన్న అధికారులు.. టన్నెల్ ?1 హెడ్ రెగ్యులేటర్ పనులు కూడా దాదాపుగా పూర్తియ్యాయన్నారు. టన్నెల్ ?2 పనులు వేగవంతం చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. పనులు ఆలస్యంకాకుండా, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న సీఎం.. రెండో టన్నెల్ పనుల్లో కచ్చితంగా పురోగతి కనిపించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. వచ్చే సమావేశానికి కార్యాచరణ ప్రణాళికతో రావాలని తెలిపారు. వంశధార స్టేజ్ 2, ఫేజ్ 2 పనులపైనా సీఎం వైఎస్ జగన్ సమీక్ష నిర్వహించారు. వీటిని ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకున్నామని.. పనులు ఆలస్యంకావడానికి వీల్లేదన్నారు. పనులు వేగంగా నడవాల్సిన అవసరం ఉందన్నారు. వంశధార?నాగావళి నదుల అనుసంధానం పనులు సత్వరమే పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.బ్రహ్మసాగర్, పైడిపాలెం ప్రాజెక్టుల మరమ్మతులను సత్వరమే చేపట్టాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. బ్రహ్మసాగర్ సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో నిల్వచేయడానికి.. అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలానే రాయలసీమ కరువు నివారణ ప్రాజెక్టులు.. గోదావరి కృష్ణా సలైనటీ మిటిగేషన్, వాటర్ సెక్యూరిటీ ప్రాజెక్టులు.. పల్నాడు ప్రాంత కరువు నివారణా ప్రాజెక్టులు..ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులపైనా సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు.

# సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలపై 31న సుప్రీం కోర్టులో విచారణ



న్యూఢిల్లీ : దేశంలో కరోనా ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు రద్దు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు శుక్రవారం విచారణకు స్వీకరించింది. జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, దినేశ్ మహేశ్వరి ధర్మాసనం విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. పిటిషన్ కాపీని ప్రతివాదులకు అందజేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. పరీక్షలను రద్దు చేసేలా సీబీఎస్ఈ, సీఐఎస్‌సీఈ బోర్డులకు ఆదేశాలు జారీ చేయాలంటూ న్యాయవాది మమతాశర్మ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పరీక్షలను రద్దు చేసి, నిర్ణీత కాలపరిమితితో ఫలితాలను ప్రకటించడానికి ఆబ్జెక్టివ్ పద్ధతిని రూపొందించేలా కేంద్రం, సీబీఎస్ఈ, సీఐఎస్‌సీఈ బోర్డులకు ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోర్టును కోరారు.దేశంలో కరోనా భారీగా కేసులు ఉన్నాయని, ఈ సమయంలో పరీక్ష నిర్వహించడం సాధ్యం కాదని, ఇంకా ఆలస్యం చేస్తే విద్యార్థుల భవిష్యత్‌కు కోలుకోలేని నష్టం వాటిల్లుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. దేశంలో కరోనా మహమ్మారి పరిస్థితుల్లో ఏప్రిల్ 14న పదో తరగతి పరీక్షలను రద్దు చేసిన బోర్డు.. 12వ తరగతి పరీక్షలను మాత్రం వాయిదా వేసింది. పరీక్షలు రద్దు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నా పరీక్షల నిర్వహణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సీబీఎస్ఈ ఇటీవల తెలిపింది. ఇటీవల కేంద్ర విద్యాశాఖ 12వ తరగతి పరీక్షలపై రాష్ట్రాలతో సమావేశం నిర్వహించింది. ఇందులో జూలై 15 నుంచి ఆగస్టు 28 మధ్య నిర్వహించాలని నిర్ణయానికి వచ్చారు.అయితే కరోనా నేపథ్యంలో పరీక్షల నిర్వహణపై కేంద్రం రెండు ప్రతిపాదనలను ముందుంచింది. ఇందులో ఒకటి ముఖ్యమైన సబ్జెక్టులకు మాత్రమే పరీక్షలు నిర్వహించడం, రెండోది అన్నింటికీ పరీక్ష నిర్వహిస్తూ సమయాన్ని 3 గంటల నుంచి 90 నిమిషాలకు కుదించాలని ప్రతిపాదించింది. ఈ రెండు ప్రతిపాదనల్లో చాలా రాష్ట్రాలు రెండో ప్రతిపాదనకు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

# ఆరోగ్యశ్రీలో ఉచితం.. మిగిలిన వారికి ప్రభుత్వ ధరలే

**కరోనా చికిత్సకు ఎక్కువ వసూలు చేస్తే ఆస్పత్రులపై క్రిమినల్ కేసులు**

**చిన్నారుల కోసం ఆస్పత్రుల్లో మౌలిక వసతులు**

**పల్లెల్లో పెరుగుతున్నాయనడం అవగాహన రాహిత్యం**

**ఆనందయ్య మందుపై స్పష్టత రావాలి**

**వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్**

అమరావతి: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పరిధిలో వైద్యం అందించాల్సిన పేషెంట్ల నుంచి డబ్బు వసూలు చేస్తే ఆయా ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా వెనుకాడబోమని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ హెచ్చరించారు. ఇటీవలే వివిధ వైద్య వర్గాలు, ఆస్పత్రుల యాజమాన్యాలను సంప్రదించి చికిత్సకు రేట్లు పెంచామని, వీటిని కూడా కాదని పేషెంట్ల నుంచి ప్రైవేటు ఆస్పత్రులు డబ్బు వసూలు చేస్తున్నట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. దీనిపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన గురువారం మంగళగిరిలోని ఏపీఐఐసీ బిల్డింగ్‌లో మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే పలు ఆస్పత్రులకు జరిమానా విధించామన్నారు. రోజూ నోడల్ అధికారులు ప్రైవేటు ఆస్పత్రులను పర్యవేక్షిస్తారని తెలిపారు.పలువురు నిపుణులు, వైద్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత చిన్నపిల్లల్లో కేసులు వస్తే ఎలాంటి వసతులు కల్పించాలన్న దానిపై కమిటీ వేశామన్నారు. వెంటిలేటర్లు, ప్రత్యేక వార్డులు, మరికొన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని, దీన్నిబట్టి అన్ని ఆస్పత్రుల్లో ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో లాక్‌డౌన్ సరిగా అమలు కానందునే పల్లెల్లో



కేసులు పెరుగుతున్నాయని రాయడం అవగాహన రాహిత్యమన్నారు. పట్టణాల్లో 1.46 కోట్ల జనాభా, పల్లెల్లో 3.49 కోట్ల జనాభా ఉందని చెప్పారు. తాజాగా వచ్చిన కేసులను బట్టి చూస్తే లక్ష జనాభాకు పల్లెల్లో 248, పట్టణాల్లో 383 కేసులు వచ్చాయన్నారు. మే 16 నుంచి 22 వరకు వారం రోజుల గణాంకాల్లో ఈ మేరకు తేలిందన్నారు. ఆ వారంలో 1,42,707 కేసులు నమోదయ్యాయని, వాటిలో పట్టణాల్లో 56,058, గ్రామాల్లో 86,649 కేసులు ఉన్నాయని వివరించారు. కేసుల్ని జనాభా ప్రాతిపదికన లెక్కించాలని, అది అవగాహన లేక కొన్ని పత్రికల్లో పల్లెల్లో ఎక్కువగా కేసులు వస్తున్నట్టు రాశారని పేర్కొన్నారు.గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వైద్యశాఖలో 1,448 మందిని ఎక్కువగా నియమించినట్లు చెప్పారు. గత ఏడాది 17,315 మందిని నియమించగా, ఈ ఏడాది 18,763 మందిని నియమించినట్టు తెలిపారు. ఇందులో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు అందరూ ఉన్నారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 23.81 లక్షల మందికి రెండు డోసులు, 36.49 లక్షల మందికి ఒక డోసు టీకా వేసినట్లు చెప్పారు. 1.41 లక్షల కోవాగ్జిన్, 13.88 లక్షల కోవిషీల్డ్ స్టాకు ఉందన్నారు.

# డిసెంబర్ నాటికి దేశ ప్రజలందరికీ టీకాలు: కేంద్ర మంత్రి జవదేకర్

న్యూఢిల్లీ : కేంద్ర పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఇవాళ ఓ శుభవార్త వినిపించారు. దేశ ప్రజలందరికీ డిసెంబర్ నాటికి కోవిడ్ టీకాలు ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. దేశంలో కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభించి 130 రోజులైంది. అయితే ఇప్పటి వరకు ఇండియాలో 20 కోట్ల మంది టీకాలు తీసుకున్నారు. కోవిడ్ నియంత్రణలో టీకాలే కీలకమని అందరూ చెబుతున్న విషయం తెలిసిందే. అయితే వ్యాక్సినేషన్‌లో 20 కోట్ల మైలురాయిని అందుకున్న రెండవ దేశంగా ఇండియా నిలిచింది. ఈ ఘనతను కేవలం అగ్రరాజ్యం అమెరికా మాత్రమే చేరుకున్నది. గత 44 రోజుల్లో ఇవాళ అత్యల్ప స్థాయిలో కొత్త కేసులు నమోదు అయ్యాయి. 2.48 కోట్ల మంది వైరస్ నుంచి కోలుకునారు. గత 24 గంటల్లో 2.59 లక్షల మంది వైరస్ నుంచి రికవరీ అయ్యారు.ఇవాళ మధ్యాహ్నం ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. 130 కోట్ల మంది జనాభాలో కేవలం 3 శాతం మందికి మాత్రమే టీకాలు ఇచ్చినట్లు రాహుల్ ఆరోపించారు. సెకండ్ వేవ్ విజృంభించడానికి మోదీయే కారణమని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీకి కౌంటర్ ఇచ్చిన జవదేకర్ మాట్లాడుతూ.. 2021 లోపే దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. వ్యాక్సిన్ల గురించి రాహుల్ ఆందోళన చెందితే, అప్పుడు ఆయన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల గురించి ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ రాష్ట్రాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ గందరగోళంగా సాగుతోందని, 18-44 ఏళ్ల వారికి ఇచ్చిన కోటాను వాళ్లు తీసుకోవడం లేదని జవదేకర్ ఆరోపించారు.




# జూన్ 15 నుంచి గోదావరి డెల్టాకు నీటి విడుదల

**మంత్రి అనిల్‌కుమార్ యాదవ్**

అమరావతి: గోదావరి డెల్టాలో ఖరీఫ్ పంటల సాగు కోసం జూన్ 15 నుంచి నీటిని విడుదల చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలగకుండా గోదావరి డెల్టాలో ఖరీఫ్ పంటలకు నీటిని విడుదల చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మంత్రులు కురసాల కన్నబాబు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీలు చింతా అనురాధ, మార్గాని భరత్, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో గురువారం ఆయన వర్చువల్ విధానంలో సమావేశం నిర్వహించారు.

# పోలవరం పూర్తి చేయాలి: చంద్రబాబు



అమరావతి: గోదావరి నదిపై పోలవరం పూర్తి చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. మహానాడులో చంద్రబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఒడిశా బార్డర్ వరకు నీటిని తీసుకెళ్లాలని చెప్పారు. తమ హయాంలో 69 ప్రాజెక్టులకు 24 ప్రాజెక్టులను పూర్తి చేశామని తెలిపారు. 32 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించామని, తోటపల్లి రిజర్వాయర్ దగ్గరే ఉండి పనులు పూర్తి చేశామని తెలిపారు. పట్టిసీమ ఏడాదిలో పూర్తి చేసి నదుల అనుసంధానికి శ్రీకారం చుట్టామని, రెండేళ్లల్లో సీఎం జగన్ నీటి పారుదల ప్రాజెక్టులకు రూ.1000 కోట్లకు మించి ఖర్చు చేయలేదని ఆరోపించారు.

# సంపాదకీయం

శనివారం 29 మే 2021

## కమలానికి యూపీతోనే బీపీ

ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్ షా పార్టీలో, అనుబంధ సంస్థల్లో అంతర్గత విభేదాలను చల్లబరిచే చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. గడచిన కొంతకాలంగా ఈ ఇరువురి చర్యల ఫలితంగా పార్టీలో సీనియర్ నేతలు అసంతృప్తికి లోనవుతున్నారు. అదే సమయంలో మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లోనూ వారి పలుకుబడి దిగజారింది. దశాబ్దం పై నుంచి అధ్యక్ష స్థానంలో సర్ సంఘ్ చాలక్ గా వ్యవహరిస్తున్న మోహన్ భగవత్ సూటిగానే విమర్శలను ఎక్కుపెడుతున్నారు. ఇటీవల కరోనా విజృంభణలో ప్రభుత్వ బాధ్యత ఉందని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారు. విపక్షాలు, వామపక్ష వాదులు భగవత్ మాటలనే ప్రాతిపదికగా చేసుకుంటూ తీవ్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ సమరం సాగిస్తు?న్నారు. ఆయన మాటలను ఖండించలేక అలాగని చూస్తూ ఊరుకోలేక మోడీ, షా లు సతమతమవుతున్నారు. ప్రభుత్వం చేసే ప్రతి తప్పునూ చూస్తూ ఊరుకోవాల్సిన అవసరం లేదని తన మాటల ద్వారా ఆర్ఎస్ ఎస్ శ్రేణులకు భగవత్ సంకేతాలు పంపించారు. కేంద్రంలోని అగ్రనాయకులిద్దరికీ ఇవి డేంజర్ బెల్స్ కిందే లెక్క. అందుకే సంఘ్ పరివార్ తో తమ సంబంధాలను మెరుగు పరుచుకోవడానికి నాయకులిద్దరూ కలిసి కట్టుగా రంగంలోకి దిగారు. ఆర్ఎస్ఎస్ అగ్రనాయకుడైన భగవత్ కొంతకాలంగా ప్రభుత్వ తీరుపై అసహనంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీలో వ్యక్తి ఆరాధన పతాకస్థాయికి చేరడం పట్ల ఆయన ఆవేదనతో ఉన్నట్లుగా చెబుతున్నారు. నాయకుడిగా ఎవరున్నా సైద్ధాంతిక అంశాల్లో రాజీపడకూడదనేది ఆర్ఎస్ ఎస్ మార్గదర్శకాల్లో కీలకమైనది. ప్రస్తుతం ప్రదాని నరేంద్రమోడీ పార్టీని మించిన ఇమేజ్ తో ఎదిగిపోయారు. ఆర్ ఎస్ ఎస్ ను సైతం కాదని బీజేపీకి ప్రత్యేక అజెండాను రూపకల్పన చేసే స్థాయికి చేరుకున్నారు. తాము పెంచి పోషించిన సంస్థ బీజేపీ. దేశంలో కమలం పార్టీ రాజకీయాధికారానికి రావడానికి శక్తి వంచన లేకుండా ఆర్ఎస్ ఎస్ కార్యకర్తలు కృషి చేశారు. మోడీ ఇమేజ్ బీజేపీ విజయానికి తోడ్పడిన మాట వాస్తవమే. కానీ పునాదులుగా నిలిచి ఆ సౌధాన్ని నిలిపింది మాత్రం ఆర్ ఎస్ ఎస్. అని బీజేపీ నాయకులు సైతం ఒప్పుకుంటారు. ప్రస్తుతం బీజేపీలో మోడీ, షా లకు ప్రత్యామ్నాయ నాయకత్వం ఇవ్వగలిగిన వారెవరూ లేరన్న వాతావరణం ఏర్పడింది. దీనిని ఆర్ ఎస్ ఎస్ జీర్ణించుకోలేక పోతోంది. సైద్ధాంతికంగా బీజేపీ పక్కదారి పడుతుందని, వ్యక్తి నియంతృత్వం ప్రమాదమని భావిస్తోంది. అందుకే భగవత్ నోటి నుంచి అసమ్మతి స్వరాలు వినవస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ కు జనరల్ సెక్రటరీ హోదాలో సర్ కార్యవాహ్ గా కర్ణాటకకు చెందిన దత్తాత్రేయ హోసబలే రెండు నెలల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. సంఘ్ చాలక్ తర్వాత అత్యంత ముఖ్య నాయకుడు ఆయన. మోడీ, అమిత్ షాలు ఆయనతో నేరుగా సమావేశమయ్యారు. కొన్ని గంటల పాటు వివిధ అంశాలు చర్చించారు. దేశంలో ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయి. కరోనాను సాకుగా చేసుకుంటూ దాడిని ఉద్ధృతం చేశాయి. ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరవుతోంది. నేరుగా ప్రధానినే టార్గెట్ చేస్తున్నాయి. ఇంతవరకూ ప్రతిపక్షాలకు దీటైన సమాధానం మోడీ చెప్పలేకపోయారు. కరోనా కట్టడిలో విఫల ప్రదానిగా, అసమర్థునిగా ఆయనపై ప్రతిపక్షాలు ముద్ర వేశాయి. గతంలో వివిధ అంశాల్లో ప్రతిపక్షాలు ప్రదానిపై దాడి చేస్తే సోషల్ మీడియాలో విపక్షాలను ప్రజలు ఏకి పారేసే వారు. కానీ విచిత్రంగా ఈసారి ప్రతిపక్షాల వాదనకే ప్రజల మద్దతు లభిస్తోంది. ఈ నేపథ్యంలో సొంత సంస్థ ఆర్ఎస్ ఎస్ కూడా తమను దూరంగా పెడితే ఏం జరుగుతుందో మోడీ, షా లకు తెలుసు. అందుకే దేశంలో రాజకీయ పరిస్థితులను, తాము చేస్తున్న కృషిని వివరిస్తూ సత్సంబంధాలను నెలకొల్పుకునేందుకు కార్యవాహ్ తో కథాకమామిషు మొదలు పెట్టారని ప్రచారం మొదలైంది. బీజేపీ కి అత్యధిక సీట్లు కట్టబెట్టిన రాష్ట్రం ఉత్తరప్రదేశ్. అక్కడ ఏమాత్రం తేడా వచ్చినా కేంద్రంలో అదికారం గల్లంతు కావడం ఖాయం. ఇటీవల రాజకీయంగా ఉత్తరప్రదేశ్ లో తీవ్రమైన మార్పులు కనిపిస్తున్నాయి. తాజాగా జరిగిన స్థానిక ఎన్నికల్లో కీలకమైన ప్రాంతాల్లో పార్టీ పట్టు కోల్పోయింది. ప్రధాని ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాశి ప్రాంతంలోనూ పరాజయం పాలయ్యింది. గత ఎన్నికల్లో ప్రధానికి ఇక్కడ 63శాతంపైగా ఓట్లు లభించాయి. సమాజ్ వాదీ, కాంగ్రెసు పార్టీలు రెండూ కలిసి మూడు లక్షల పైచిలుకు ఓట్లు మాత్రమే తెచ్చుకుంటే ప్రదాని ఆరులక్షల డెబ్భైవేల ఓట్లతో ఘన విజయం సాధించారు. అటువంటి ప్రాంతంలో పంచాయతీ ఎన్నికల్లో పతనం కావడం పరిస్థితులకు అద్దం పడుతోంది. రాష్ట్ర రాజధాని లక్నో ప్రాంతంలోనూ పార్టీకి పట్టు చిక్కలేదు. ముఖ్యమంత్రి సొంత ప్రాంతమైన గోరఖ్ పూర్ ప్రాంతంలోనూ ఘోరమైన అవమానమే మిగిలింది. మరోవైపు పశ్చిమ ఉత్తరప్రదేశ్ లో వ్యవసాయ చట్టాల రద్దు కోరుతూ రైతులు ఆందోళనలు సాగిస్తున్నారు. ఇవన్నీ రాజకీయంగా ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో యూపీలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అందువల్ల తక్షణం ఉత్తరప్రదేశ్ లో పరిస్థితులను చక్కదిద్దుకోవాలి. ఆర్ఎస్ఎస్ ప్రభావం అక్కడ చాలా ఎక్కువ. కలిసి కట్టుగా నడిచేట్లుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకత్వాలు నిర్ణయం తీసుకుంటేనే సత్ఫలితాలు లభించేందుకు అవకాశం ఉంటుందని మోడీ, షా లకు తెలుసు.

# ఎన్నికల కోసం మహాకూటమి




కడప, మే 28, (న్యూస్ పల్స్) బద్వేలు ఉప ఎన్నిక అనివార్యం. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటసుబ్బయ్య మృతితో అక్కడ ఎన్నిక ఖచ్చితంగా నిర్వహించాల్సిందే. అయితే కోవిడ్ కారణంగా ఇప్పట్లో ఉప ఎన్నికలు లేవని కేంద్ర ఎన్నికల కమిషన్ చెప్పినా, ఎప్పటికైనా అక్కడ ఎన్నిక జరగాల్సిందే. అయితే అక్కడ వైసీపీ వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులకే టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే టీడీపీ మాత్రం ఇక్కడ పోటీ చేయాలని అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బద్వేలు ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని చంద్రబాబు నిర్ణయించడంతో అక్కడ పార్టీ అభ్యర్థిపై ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని భావిస్తున్నారు. సర్వే ద్వారా అభ్యర్థిని ఎంపిక చేయాలన్నది చంద్రబాబు ఆలోచన. బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి గ్రిప్ ఉంది. అయితే కడప జిల్లాలో ఉండటం, ఉప ఎన్నిక కావడంతో వైసీపీకి అడ్వాంటేజీ ఉంటుందని తెలిసినా, చంద్రబాబు బద్వేలులో పోటీ చేయాలనే భావిస్తున్నారు. బద్వేలు నియోజకవర్గంలో టీడీపీకి మంచి ట్రాక్ రికార్డు ఉంది. 1985, 1994, 1999, 2001లో వరస గెలుపులతో బద్వేలు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగిరింది. 2004 నుంచి 2019 వరకూ మాత్రం టీడీపీకి గెలుపు అవకాశాలు దక్కలేదు. ఓటు బ్యాంకు, సరైన నేతలు ఉండటంతో ఈసారి పోటీ చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. స్థానికనేతల అభిప్రాయంతో పాటు, సర్వే ద్వారా బద్వేలు టీడీపీ అభ్యర్థిని ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయితే ఇక్కడ బీజేపీ కూడా పోటీ చేసే అవకాశముంది. మాజీ ఎమ్మెల్యే జయరాములును బరిలోకి దింపే అవకాశాలున్నాయి. ఇక జనసేన కు పెద్దగా అక్కడ ఓటు బ్యాంకు లేదు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు వామపక్షాలు, కాంగ్రెస్ తో కలసి పోటీ చేయాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ తో నేరుగా పొత్తు లేకపోయినా అవగాహన కుదుర్చుకోవాలంటున్నారు. కమ్యునిస్టు పార్టీలను నేరుగా కలుపుకుని వెళ్లాలన్న యోచనలో ఉన్నారు. దీని ద్వారా 2024 ఎన్నికల కూటమికి ఒక దారి ఏర్పడుతుందన్నది చంద్రబాబు భావన. మరి ఓట్లే లేని ఈ రెండు పార్టీలను కలుపుకుని వెళితే చంద్రబాబుకు లాభం కంటే నష్టమేనన్న వ్యాఖ్యలు కూడా విన్పిస్తున్నాయి. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

# 410 గ్రామాలకు తాడిపూడి ఎత్తిపోతల పథకం

విజయవాడ, మే 28, (న్యూస్ పల్స్) తాడిపూడి ఎత్తిపోతల పథకం లో అక్రమాలు రాజ్యం ఏలుతున్నాయి. ష్గా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 33 మండలాల్లోని 4.80 లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఉద్దేశంతో తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారు. 410 గ్రామాల్లో 21 లక్షల మందికి తాగునీరందించడం ఈ పథకం లక్ష్యంలో భాగం. దీనికోసం 12,512 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. ఇందులో 9533 ఎకరాలు అటవీ భూమి. భూసేకరణ దాదాపు పూర్తయ్యింది. అయితే భూసేరణకు సంబంధించి కొన్నిచోట్ల వివాదాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు విలువ రూ. 4,062 కోట్లు. నాలుగు ప్యాకేజీల కింద పనులు చేపడుతున్నారు. భూసేకరణ పూర్తయ్యింది. నిర్వాసితుల బ్యాంకు ఖాతాలకు పరిహారం నిధులు జమ చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో లబ్ధిదారులకు పరిహారం మంజూరైంది. ఇంకా కొన్ని చోట్ల జమకావాల్సి ఉంది. గోపాలపురం మండలంలోని రెండు గ్రామాల రైతులకు మాత్రం పరిహారం రెండుసార్లు జమ అయ్యింది. గుడ్డిగూడెం, భీమోలు గ్రామాల రైతులకు ఈ పరిహారం జమైనట్లు తెలుస్తోంది. సాంకేతికంగా చిన్న తప్పిదం వల్ల ఈ సంఘటన జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలకు అదనంగా జమైన సొమ్ము సుమారు రూ. 7.5 కోట్లు ఉంటుందని అంచనా. ఈ తప్పిదం గుర్తించిన అధికారులు ఈ సొమ్మును తిరిగి తీసుకునేందుకు చర్యలు ప్రారంభించారని అంటున్నారు. అయితే ఇప్పటికే రైతులు ఆ సొమ్మును తీసేసుకున్నట్లు చెబుతున్నారు. రికవరీ కోసం ఆర్ ఆర్ యాక్టును ప్రయోగించినట్లు సమాచారం. ఇటీవల అమల్లోకి వచ్చిన సీఎఫ్ఎంఎస్ విధానంలో టెక్నికల్ ఎర్రర్ వల్ల ఈ తప్పిదం జరిగింది. ఈ విధానం రాకముందు పాతబిల్లులు పెట్టాం. ఈ విధానం అమల్లోకి వచ్చాక కొత్తబిల్లులు పెట్టాం. పాత బిల్లులు ఆపేయాలని ప్రాజెక్టు అధికారులకు లేఖ రాశాం. దాన్ని పట్టించుకోక పోవడం వల్ల తలెత్తిన సమస్య ఇది. రైతులతో సమావేశం నిర్వహించాం. వారు కూడా సానుకూలంగా స్పందించారు. ఈ సొమ్ము తిరిగి వచ్చేస్తుంది. రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారం అయిపోతుందని ఓ అధికారి చెప్పారు.

# కర్నూలులో సగానికి పడిపోయిన మామిడి



కర్నూలు, మే 28, (న్యూస్ పల్స్) మామిడి రైతుల కష్టాలు వర్ణనాతీతం. మామిడి కాయలు నిల్వ చేసి ఎగుమతి చేసేందుకు అవకాశం లేక జిల్లా రైతులే జాతీయ రహదారిపై అమ్మకాలు చేపట్టారు. కర్నూలు?బెంగళూరు రహదారి, కర్నూలు? చిత్తూరు రహదారి పై చిన్న కొట్లను ఏర్పాటు చేసుకుని మామిడి పండ్లు విక్రయిస్తున్నారు. మామిడి దిగుబడి సాధారణంగా మార్చి నెల నుంచే ప్రారంభం కావాలి. ఈసారి ఏప్రిల్ 3వ వారం నుంచి మొదలైంది. దీనికితోడు గాలి, వానలకు సుమారు వందల ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాధారణంగా ఎకరా మామిడి తోటకు ఐదు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా ఒకటిన్నర టన్ను మాత్రమే వచ్చింది. ఈ పండ్లు కూడా గత నెలలో డజను ధర రూ. 150 పలకగా ఇప్పుడు రూ. 75కి పడిపోయింది. పక్వానికి వచ్చిన మామిడి కాయలకు సరైన ధర లభించక, తక్కువ ధరకు ఎగుమతి చేయలేక కొందరు రైతులు చిరు వ్యాపారుల అవతారమెత్తాల్సి వస్తోంది. మరి కొందరు గ్రామాల్లో సైకిళ్ల పై, తోపుడు బండ్ల పై తిరుగుతూ అమ్ముతున్నారు. సకాలంలో విక్రయించుకోకపోతే పండ్లు దెబ్బతింటాయి. దీంతో లాభం లేకపోయినా పర్వాలేదు కానీ నష్టం రాకపోతే చాలని వినియోగదారులు అడిగిన ధరకే ఇచ్చేస్తున్నారు. జిల్లాలో బనగానపల్లె, డోన్, రామళ్లకోట, గోవర్ధనగిరి, ప్యాపిలి, పాణ్యం, ఆళ్లగడ్డ, నంద్యాల తదితర ప్రాంతాల్లో సుమారు 20వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. పక్వానికి వచ్చిన కాయలను పండ్లుగా మార్చి వ్యాపారం చేసేందుకు స్థానికంగా సరైన రైపనింగ్ (మాగబెట్టే) కేంద్రాలు లేవు. కర్నూలు, డోన్‌లలో ఆ కేంద్రాలు ఏర్పాటు దశలోనే ఉన్నాయి. అదే రైపనింగ్ కేంద్రాలు ఉంటే కాయలను మాగించి గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

# మార్కెట్లో నకిలీ విత్తనాలు హల్ చల్



కర్నూలు మే 28, (న్యూస్ పల్స్) ఖరీఫ్ ముంచుకొస్తున్న తరుణంలో నకిలీ పత్తి విత్తనాల బెడద రైతులను కలవరపరుస్తోంది. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తుండటంతో నకిలీ బీటీ పత్తి విత్తనాల బెడద అధికమైంది. ఇటీవల ఎమ్మిగనూరు మండలంలో 60 ప్యాకెట్ల నకిలీ విత్తన ప్యాకెట్లు పట్టుబడ్డాయి. తాజాగా పత్తికొండ మండలం కనకదిన్నెలో నాలుగు క్వింటాళ్ల నకిలీ విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోనే కాకుండా.. గుంటూరు, ఒంగోలు జిల్లాలకూ ఈ నకిలీలు తరలివెళ్తుండటం ఆందోళన కలిగిస్తోంది. నకిలీ విత్తనాలపై రైతులకు అనుమానం రాకుండా పేరొందిన కంపెనీలు, వాటి విత్తన రకాల పేర్లతో ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో విక్రయిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో 1.76 లక్షల హెక్టార్లలో పత్తి సాగయింది. నకిలీల కారణంగా మొక్కలు ఏపుగా పెరిగినా పూత, కాయ రాకపోవడంతో రైతులు పంట నష్టపోయారు. పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు నియోజకవర్గాల్లో దాదాపు 5వేల హెక్టార్లలో పంటలు దెబ్బతినడం గమనార్హం. ఈ నకిలీ వ్యాపారంలో కొందరు టీడీపీ నేతలు క్రియాశీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది మొత్తం మీద పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, గులాబి రంగు పురుగు బెడద తగ్గడం.. ధరలు కూడా మెరుగ్గా ఉండటంతో ఈ ఏడాది పత్తి భారీగా సాగయ్యే అవకాశం ఉంది. జిల్లా యంత్రాంగం 2.05 లక్షల హెక్టార్లలో పత్తి సాగు కావచ్చని అంచనా వేసింది. ప్రభుత్వం జిల్లాకు వివిధ కంపెనీలకు చెందిన 10.15 లక్షల బీటీ విత్తన ప్యాకెట్లు కేటాయించింది. అయితే ఇంతవరకు బీటీ విత్తన ప్యాకెట్లు పొజిషన్ కాలేదు. .

## రాజకీయాలకు సీకే బాబు గుడ్ బై

తిరుపతి, మే 27, (న్యూస్ పల్స్) చిత్తూరు జిల్లాలో సుదీర్ఘకాలం రాజకీయం చేసి ఇప్పుడు అస్త్రసన్యాసం చేశారు సీకే బాబు. సీకే బాబు పూర్తి పేరు సీకే జయచంద్రారెడ్డి, ఆయన అభిమానులు ఆయనకు పెట్టుకున్న ముద్దుపేరు చిత్తూరు టైగర్. ఇప్పుడు పూర్తిగా తాను రాజకీయాల నుంచి తప్పుకుని తన కుమారుడిని రాజకీయ అరంగేట్రం చేయించాలని సీకే బాబు చూస్తున్నారట. ఆయన కుమారుడు సాయి కృష్ణను వైసీపీలోకి పంపాలని సీకేబాబు ప్రయత్నిస్తున్నారు. సీకేబాబు చిత్తూరు నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వీర విధేయుడు. మాస్ ఓటర్ల అభిమానం కలగిన సీకేబాబు 1989లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1994, 1999, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సత్తా చాటిన సీకేబాబుకు ఇప్పుడు గడ్డు రోజులొచ్చాయి. పదేళ్ల నుంచి ఆయనకు రాజకీయాలు కలసి రావడం లేదు. సీకే బాబు తన పట్టు కోల్పోకూడదన్న తపనతో అన్ని పార్టీలూ మారారు. తొలుత బీజేపీలో చేరారు. అక్కడి నుంచి టీడీపీలో చేరిపోయారు. చంద్రబాబు కూడా సీకే బాబును సాదరంగా ఆహ్వానించి గత ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపు బాధ్యతను అప్పగించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి తర్వాత సీకే బాబు పార్టీకి పూర్తిగా దూరమయ్యారు. ఆయన ప్రస్తుతం రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన ముఖ్య అనుచరుల సమావేశంలో సీకేబాబు వెల్లడించినట్లు తెలిసింది. సీకే బాబు కుటుంబ సభ్యుల నుంచి కూడా వత్తిడిని ఎదుర్కొంటున్నారు.

## 175 నియోజకవర్గాల్లో లెక్కేంటీ

విజయవాడ, మే 28, (న్యూస్ పల్స్) జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీని ఎప్పుడు గాడిలో పెడతారు? 175 నియోజకవర్గాలకు ఇన్ ఛార్జులను ఎప్పుడు నియమిస్తారు? ఆయన అస్సలు పార్టీని విజయపథాన నడిపించగలరా? అన్న ప్రశ్న ఆ పార్టీలోనే తలెత్తుతుంది. జనసేన పార్టీకి జవసత్వాలు తెచ్చేందుకు పవన్ కల్యాణ్ ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు కరోనా ను సాకుగా చూపిస్తున్నప్పటికీ, కరోనా ఉధృతి లేని సమయంలోనూ ఆయన పట్టించుకున్నదేమీ లేదంటున్నారు. జనసేన పార్టీ ఇరవై ఐదేళ్ల భవిష్యత్ ను దృష్టి లో ఉంచుకుని పెట్టిందని పవన్ కల్యాణ్ పదే పదే చెబుతారు. కానీ అందుకు తగిన చర్యలు మాత్రం కన్పించడం లేదు. జనసేన పార్టీ ఆవిర్భవించి ఏడేళ్లు కావస్తుంది. ఈ ఏడేళ్లలో పవన్ కల్యాణ్ చేసిందేమిటన్న ప్రశ్న సహజంగానే ఉదయస్తుంది. ఏ పార్టీ అయినా క్షేత్రస్థాయిలో బలంగా ఉంటేనే ఎన్నికల్లో విజయం దక్కుతుంది. అయితే ఇప్పటి వరకూ క్షేత్రస్థాయిలో జనసేన లేదనే చెప్పాలి. 175 నియోజకవర్గాలకు ఇన్ ఛార్జులే ఇప్పటి వరకూ లేరు. తమకు నమ్మకమైన వారిని మాత్రమే కొద్ది నియోజకవర్గాల్లో నియమించారు. అంతకు మించి దాదాపు వందకు పైగా నియోజకవర్గాల్లో జనసేన పార్టీకి ఇన్ ఛార్జులు లేరు. పవన్ కల్యాణ్ ఏదైనా పిలుపు ఇస్తే అప్పటికప్పుడు ఆయన అభిమానులు స్పందించి చేయాల్సిందే తప్ప పార్టీకి బాధ్యులు లేరు. పార్టీకి బాధ్యులను నియమించడానికి పవన్ కల్యాణ్ భయపడుతున్నట్లు చెబుతున్నారు. ఎవరికి ఇన్ ఛార్జి పదవి ఇచ్చినా వారితో తలెత్తే ఇబ్బందులకు పార్టీ బాధ్యత వహించాల్సి వస్తుందని పవన్ కల్యాణ్ భావించడం వల్లనే ఇంతవరకూ బాధ్యులను నియమించలేదు. మరో వైపు బీజేపీతో పొత్తు కూడాఉంది. భవిష్యత్ లో టీడీపీతో కూడా కలిసే అవకాశాలు లేకపోలేదు. బాధ్యులు లేకపోయినందునే జనసేన ఇప్పటికీ ఆ రెండు జిల్లాలకే పరిమితమయిందన్న విమర్శలున్నాయి. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలో పార్టీకి పునాదులే లేవు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ తో జట్టుకట్టినా ఆయనకు ఎన్ని స్థానాలు ఇస్తారన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతాయి. అయినా పవన్ కల్యాణ్ మాత్రం ఇవేమీ పట్టించుకోవడం లేదు. పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేయడంలేదు.

## మిలాఖత్ పాలిటిక్స్ తో మార్పులు

విజయవాడ, మే 27, (న్యూస్ పల్స్) కృష్ణా జిల్లాలో ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం పామర్రు. దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ సొంత నియోజకవర్గం. కాంగ్రెస్‌కు ఒకప్పుడు కంచుకోట వంటి నియోజకవర్గంలో 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. 2014లో వైసీపీ తరఫున గెలిచిన ఉప్పులేటి కల్పన అంతకుముందు టీడీపీలో ఉన్నారు. ఈ పరిచయాల ప్రభావంతో ఆమె 2017లో మళ్లీ టీడీపీలోకి జంప్ చేశారు. ఇక, ఈ క్రమంలో 2019లో కైలే అనిల్ కుమార్‌కు జగన్ అవకాశం కల్పించారు. దీంతో ఆయన గెలిచారు. ఇక, టీడీపీ తరఫున అదే ఎన్నికల్లో పోటీ చేసిన కల్పన ఓడిపోయారు. అయితే.. కొన్నాళ్లు మౌనంగా ఉన్న ఉప్పులేటి కల్పన.. తర్వాత వైసీపీలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే వార్తలు వచ్చాయి. కానీ, ఎందుకో ఈక్వేషన్లు కుదరలేదు. దీంతో ఆమె టీడీపీలోనే ఉన్నారు. కానీ, పార్టీ కార్యక్రమాలకు అటెండ్ కావడం లేదు. పైగా.. పార్టీ అధినేత సహా.. ఇక్కడ కీలక నేతగా ఉన్న.. వర్ల రామయ్య (ఉండేది విజయవాడే అయినా.. నియోజకవర్గంలో చక్రం తిప్పుతున్నారనే పేరుంది)కు కూడా టచ్‌లో ఉండడం లేదు. ఇదిలావుంటే.. గత ఏడాది నుంచి ఉప్పులేటి కల్పన వర్సెస్ అనిల్ కుమార్ మధ్య రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇద్దరు కొన్ని రోజులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నా.. తర్వాత మాత్రం కలిసిపోయి.. రాజకీయాలు చేసుకుంటున్నారన్న టాక్ అయితే నియోజకవర్గంలో బలంగా వినిపిస్తోంది. తమకు పనులు చేయించుకునేందుకు ఉప్పులేటి కల్పన ఎమ్మెల్యేకు తరచుగా ఫోన్లు చేస్తుండడం.. ఎమ్మెల్యే కూడా తమ లోపాలను బయటకు తీసుకురావద్దనే ధోరణితో ప్రతిపక్ష పార్టీలో ఉన్న కల్పనతో సర్దుబాటు చేసుకున్నట్టు నియోజకవర్గంలో టాక్ వినిపిస్తోంది. అయితే.. ఈ వ్యవహారంలో ఎన్ని విమర్శలు వచ్చినా.. ఎవరూ కూడా ఖండించడం లేదు. కొన్ని మీడియాలు ఈ ఇద్దరి మధ్య ఉన్న మిలాఖత్ పాలిటిక్స్‌పై కథనాలు రాస్తున్నాయి. ఇసుక, మట్టి వంటి విషయాల్లో దూకుడుగా ఉన్నప్పటికీ.. అధికార పార్టీ ఎమ్మెల్యేను ఉప్పులేటి కల్పన టార్గెట్ చేయడం లేదు. ఇక.. గతంలో ఎస్సీలకు కేటాయించిన నిధులను ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన సొంతానికి వాడుకున్నారని ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన అనిల్ కూడా ఈ విషయం పూర్తిగా మరిచిపోయారు. దీంతో అసలు ఇద్దరి మధ్య రహస్య ఒప్పందం చేసుకున్నారనే వ్యాఖ్యలు.. వినిపిస్తున్నాయి. వర్ల రామయ్యకు చెక్ పెట్టేందుకే ఉప్పులేటి కల్పన అనిల్‌తో చేతులు కలిపారన్న టాక్ కూడా ఉంది. మరి పామర్రు టీడీపీ రాజకీయం ఎటు మలుపులు తిరుగుతుందో ? చూడాలి.

## కష్టకాలంలో కనిపించని కొత్త నేతలు

గుంటూరు, మే 28, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, కార్పొరేషన్లలో వైసీపీ పాగా వేసిన విషయం తెలిసిందే. దీంతో భారీ సంఖ్యలో వైసీపీ నాయకులకు పదవులు లభించాయి. రాష్ట్రం మొత్తం మీద ఒక్క అనంతపురం జిల్లా తాడిపత్రి మినహా ఒక్క చోట కూడా టీడీపీ గెలవలేదు. కార్పొరేషన్ మేయర్లు, చైర్మన్లు, చైర్ పర్సన్లతో పాటు డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్లు.. అంటూ.. వివిధ పదవులు కట్టబెట్టారు. ఇక, వీరికి మూడు రోజుల పాటు వారు చేయాల్సిన పనులు, ప్రజలకు ఎలా చేరువ కావాలి? వంటి కీలక విషయాలపై శిక్షణ కూడా ఇచ్చారు. ప్రస్తుత కరోనా సమయంలో వీరి వల్ల నగరాలు.. పట్టణాలు శుభ్రంగా ఉంటాయని, ప్రజలకు సేవలు చేరువ అవుతాయని అనుకున్నారు. కానీ, కొత్తగా ఎన్నికైన వారిలో అనుభవం లేకపోవడంతో వారు ఎవరూ కూడా ముందుకు రావడం లేదు. జగన్ సామాజిక సమీకరణలు, ఇతరత్రా సమీకరణలు అంటూ కొత్తవారికి, ప్రజల్లో తిరగని వారికి పదవులు కట్టబెట్టారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జనాల్లోనే ఉన్న నేతలకు పదవులు లేకపోవడంతో వారు కరోనా కష్టకాలంలో ఇంట్లో నుంచి బయటకు రావడం లేదు. పదవులు వచ్చిన వారు కరోనా భయంతో పాటు అనుభవం లేకపోవడంతో ఏం చేయలేని దుస్థితి. నగరాలు, మునిసిపాలిటీ, కార్పొరేషన్లలో ఏ ఒక్కరూ కూడా ప్రస్తుత కరోనా సమయంలో సేవలు అందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. లెక్కకు మిక్కిలిగా ఉన్న.. మేయర్లు, చైర్మన్లు కూడా ప్రజల మధ్య ఉండడం లేదు. వారు ఏం చేస్తున్నారో.. కూడా ఎవరికీ తెలియదు. ఈ పరిణామాలను గమనిస్తే.. ప్రజలు అసలు ఎన్నికలు ఎందుకు పెట్టారు? వీరిని మేం ఎందుకు ఎన్నుకున్నాం.. అనే ప్రశ్నలు సంధిస్తున్నారు. నిజానికి గత ఏడాది కరోనా తొలి దశలో.. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లుకూడా ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. దీంతో అప్పట్లో.. ప్రత్యేకంగా కంటైన్మెంట్ జోన్లు ఏర్పాటు చేశారు.

# రెండు వంతెనలకు నిధులు మంజూరు

## కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఎంపి బాలశౌరి

విజయవాడ భీమవరం, మచిలీపట్నం రైల్వేట్రాక్ల పై పామర్రు, భీమవరం రహదారులపై వంతెనలు లేకపోవడంతో గుడివాడ వాసులు పడుతున్న వెతలు ఇకపై తీరనున్నాయి. గుడివాడ-మచిలీపట్నం రైల్వేట్రాక్వద్ద పైవంతెన నిర్మాణానికి 75కోట్లు మంజూరయ్యా యని ఎంపీ వల్లభనేని బాలశౌరి వెల్లడించారు. లెవెల్ క్రాసింగ్-52 వద్ద భీమవరం-విజయవాడ రైల్వేట్రాక్ పై ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.125 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. రెండు వంతెనల డిజైన్లు తయారు చేసి నేషనల్ హైవే అధికారులకు పంపు తామని అన్నారు. రెండు వంతెనల నిర్మాణానికి సహకరించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. నాలుగునెలల్లో వంతెనల నిర్మాణపనులు ప్రారంభిస్తామని ఎంపీ బాలశౌరి చెప్పారు. పామర్రు నుంచి ముదినేపల్లి మీదుగా కైకలూరు వెళ్లే రోడ్డుకు భూసేకరణ జరుగుతోందని, కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. పామర్రు నుంచి ముదినేపల్లి మీదుగా కైకలూరు వెళ్లే రోడ్డు నిర్మాణానికి భూసేకరణ జరుగుతోం దని చెప్పారు. దానికితోడు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రప్రభుత్వం టెండర్లు కూడా పిలిచిందని వివరించారు. గుడివాడ పామర్రు రహదారిపై ఉన్న భీమవరం, మచిలీపట్నం రైల్వేట్రాక్ లు గుడివాడ పట్టణ పరిధిలోనే ఉన్నాయన్నారు. రైల్వే ట్రాక్ లపై పై వంతెనల నిర్మాణానికి ఎంపీ బాలశౌరి పార్లమెంట్లో బయట కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, ఆయా శాఖల అధికారులతో చర్చించి ఒప్పించారని మంత్రి కొడాలి నాని అన్నారు. వైసీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో ఎన్టీఆర్ జయంతి

విశాఖపట్నం సీని రంగంలో తెలుగు జాతికి ఎన్టీఆర్ మంచి పేరు తెచ్చారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. ఎన్టీఆర్ 98 వ జయంతి సందర్భం గా విశాఖ బీచ్రోడ్లో ఉన్న



ఆయన విగ్రహానికి అచ్చెన్నాయుడు,ఎమ్మెల్యే వెలగపూడి, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నగర టీడీపీ నేతలు నివాళర్పించారు. అనంతరం అచ్చెన్నా మాట్లాడుతూ తెలుగు జాతికి సేవ చేయాలని సినీ రంగాన్ని విడిచి పెట్టి రాజకీయంలోకి వచ్చారన్నారు. రాజకీయలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. నేడు పిల్లకాకి సంక్షేమం కోసం మాట్లాడుతున్నారని.. సంక్షేమం అంటే ఆనాడు ఎన్టీఆర్ పెట్టినవే అని స్పష్టం చేశారు. ఆనాడు జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలను ఏకం చేసి పోరాటం చేసిన ఘనత ఎన్టీఆర్దని గుర్తుచేశారు. రాష్ట్రంలో అరాచక, రౌడీ పాలన నడుస్తోందని విమర్శించారు. ప్రతి పక్ష పార్టీలపై దాడులు, కుట్రలు జరుగుతున్నాయన్నారు. టీడీపీ అనేది పోరాటం పార్టీ అని ..మళ్లీ అధికారం లోకి వచ్చి ఎన్టీఆర్కు నివాళులు అర్పిస్తామని అచ్చెన్నాయుడు తెలిపారు.

# గ్రామాల్లో విస్తరిస్తున్న కరోన వైరస్

కోవిడ్ నిబంధనలు పాటించకపోతే ఇక కఠిన చర్యలే ప్రభుత్వ అధికారులు కౌతాళం మండలం లో కోవిడ్ సెకెండ్ వే చాల స్పీడ్ గా విస్తరిస్తున్నది. కొంతమంది మూతికి మాస్క్ ధరించకుండ సామాజిక దూరంపాటించకుండా కోవిడ్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నరు.నదిచగి గ్రామంలో 30 మందికి కరోన తేలడంతో కరోన మహమ్మారి ని కట్టడి చేయడానికి గ్రామ సర్పంచ్, నాయకులు రామన్న గౌడ్, ఆర్ ఐ ,విఆర్వో, మహిళ పోలీసు అధికారులు వలేంటీర్లు ముందస్తు చర్యలు మొదలుపెట్టారు. విధుల్లో పరిశుభ్రత, డ్రైనేజీలు వ్యవస్థ, బ్లీచింగ్ పౌడర్, ఐపో స్ప్రే , కొట్టారు. గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించి ,మూతికి మాస్క్ ధరించి అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఎవరూ బయటికి రాకూడదని వైసీపీ నాయకులు రామన్న గౌడ్ పేర్కొన్నారు. కరోన నియంత్రణ కు తీసుకోవాల్సిన గురించి అవగాహన కల్పిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# యువకుడి దారుణ హత్య

పలమనేరు కూతుర్ని ప్రేమించాడని ఓ యువకుడ్ని హతమార్చి పొలాల దగ్గర వడ పూడ్చిపెట్టిన దారుణ సంఘటన పలమనేరు మండలం పెంగరగుంట లో చోటుచేసుకుంది. పలమనేరు డిఎస్పి గంగయ్య కథనం మేరకు పెంగరగుంట గ్రామానికి చెందిన ధనశేఖర్ అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి 10 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ధనశేఖర్ కు ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకుంది. ఇద్దరూ ఇంట్లో ఉండటాన్ని గమనించిన యువతి తండ్రి యువతిని వేరే గదిలోకి పంపి ధనశేఖర్ ను హత్యచేసి బావిలో పడేసాడు. రెండ్రోజుల తరువాత శవం తేలడంతో శవాన్ని బయటకు తీసి ముక్కలుగా చేసి పూడ్చిపెట్టాడు. ధనశేఖర్ కనిపించకుండా పోవడంతో పోలీసులకు పిర్యాదు చేసారు. కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు యువతి తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయ వెలుగుచూసింది. శవాన్ని బయటకు తీసిన పోలీసులు సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. మృతుని బంధువులు హత్యచేసిన వారి వివరాలు బహిరంగంగా వెల్లడించాలని రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. డిఎస్పీ గంగయ్య న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చి ధర్నా విరమింపజేశారు.

### శ్రీ సాయిరాం వృద్ధుల ఆశ్రమానికి బియ్యం కూరగాయలు వితరణ

నెల్లూరు ఏఐ.వై.ఎఫ్ అద్వర్యంలో గూడూరులోని శ్రీ సాయిరాం వృద్దుల ఆశ్రమానికి బియ్యం కూరగాయలు నిత్యావసర వస్తువులు శుక్రవారం పంపిణి చేయడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వైరస్ నేపథ్యంలో వివిధ ఆశ్రమ నిర్వాహకులు ప్రభుత్వం లేదా దాతల నుండి సరైన సహకారం అందని కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటువంటి సందర్భాలలో మనసున్న దాతలు ఆయా ప్రాంతాలలోని ఆశ్రమాల స్థితిగతులు తెలుసుకొని వృద్దులకు, వికలాంగులకు, అనాధలకు చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో తమ వంతు సహకార చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.శశి కుమార్ ఏఐ.వై.ఎఫ్ జిల్లా కన్వీనర్ సునీల్ యాదాల ,ఏఐ.వై.ఎఫ్ పట్టణ కార్యదర్శి చల్లా .వెంకటేశ్వర్లు ,ఏఐ.వై.ఎఫ్ నాయకులు వెంకటేష్ .రాజా . శరత్ .మల్లి తడితురులు పాల్గొన్నారు.

# ప్రజాకర్షక పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

## ఆయన జీవితం స్ఫూర్తిదాయకం..

## గన్ని కృష్ణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు.

## శానిటరీ సిబ్బందికి శానిటైజర్లు,మాస్కులు,కళ్ళజోళ్ళు,గ్లౌజులు పంపిణీ..

రాజమహేంద్రవరం..ప్రజాకర్షక పథకాలకు ఆద్యుడు నందమూరి తారకరామారావు అని,ఆయన జీవితం ఒక గ్రంధాలయం వంటిదని గుడా మాజీ చైర్మన్,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు.ఎన్టీఆర్ 98వ జయంతి సందర్భంగా గన్ని కృష్ణ నివాసం వద్ద వేడుకలు నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి గన్ని కృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా 42వ డివిజన్ పారిశుధ్య కార్మికులకు శానిటైజర్లు,మాస్కులు,కళ్ళజోళ్ళు,గ్లౌజులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు.పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచారు.అనంతరం గన్ని కృష్ణ మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో తిరుగులేని నటుడిగా అంతర్జాతీయంగా ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించి తెలుగు ప్రజల కష్టాలు,బాధలు చూసి రాజకీయాలలో అడుగు పెట్టిన ఎన్టీఆర్ రికార్డు సాధిస్తూ కేవలం తొమ్మిది నెలల కాలంలో పార్టీని అధికారంలోకి తెచ్చి ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి 'సమాజమే దేవాలయం-ప్రజలే నా దేవుళ్ళు' అన్న సిద్దాంతంతో నీతివంతమైన పాలన అందించారని కొనియాడారు.ఎన్టీఆర్ జయంతి స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిట్టూరి ప్రవీణ్ చౌదరి,మొల్లి చిన్నియాదవ్,వంకా శ్రీనివాస చౌదరి,సెనివాడ అర్జున్,వానపల్లి శ్రీనివాస్,మొండి సత్యనారాయణ, సింహాద్రి కోటిలింగేశ్వరరావు,సింహాద్రి నతీష్,జి.కొండబాబు,అన్నవరం, రత్నరాజు,గోవింద్,సారధి,రమేష్,బుచ్చిబాబు,కంచిపాటి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# రోజాకు అదే మైనస్సా


హైదరాబాద్, మే 27, (న్యూస్ పల్స్) జగన్ వెనకాల వేయి మాటలు అనుకోవచ్చు. కానీ ఆయన ముందు మాట్లాడే నాయకులు ఎవరూ ఉండరూ అనే అంటారు. జగన్ కి పార్టీలోని నాయకులకు మధ్య వన్ టూ టెన్ అన్నట్లుగా అతి పెద్ద అంతరం కొనసాగుతూనే ఉంటుంది. అది దాటి దగ్గరకు వచ్చేవారు బహుశా వైసీపీలో లేరు అనుకోవాల్సిందే. ఇదిలా ఉంటే జగన్ కి తన పార్టీలో ఉన్న ప్రతీ నాయకుడి గురించి అన్నీ విషయాలు తెలుస్తూంటాయి. ఆయన నెట్ వర్క్ ఆయనకు ఉంటుంది. ఇక జగన్ ఒకరికి పదవి ఇవ్వాలనుకున్నా లేక చాన్స్ ఇవ్వాలనుకున్నా కూడా తనదైన లెక్కలు వేసుకుంటారు. వాటికి తూగితేనే ఎవరికైనా పదవులు వరించేది.ఆర్కే రోజాది రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం. ఆమె తెలుగుదేశం పార్టీలో రెండు సార్లు పోటీ చేసి ఓడినా అనుభవం బాగానే గడించారు. అక్కడ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా పనిచేశారు. ఇక జగన్ వైపు షిఫ్ట్ అయ్యాక ఆమె అనుభవం వైసీపీకి ఎంతగానో ఉపయోగపడింది. 2014 నుంచి 2019 మధ్యలో ఆర్కే రోజా వైసీపీకి ఒక శక్తివంతమైన నాయకురాలిగానే ఉన్నారు. దాంతో తమ పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి అవడం ఖాయమని ఆమె గట్టిగానే భావించారు. కానీ జగన్ మాత్రం సమీకరణల కారణంగా ఇవ్వలేకపోయారు. అయితే విస్తరణలో తనకు చాన్స్ ఖాయమని ఆర్కే రోజా పెద్దాశలే పెట్టుకున్నారుట.అయితే ఆర్కే రోజా ఇపుడు వైసీపీకి పొలిటికల్ గా బద్ధశత్రువు లాంటి ఒక మీడియా యజమాని ఆద్వర్యంలో వచ్చే జబర్దస్త్ షో లో జడ్జిగా వ్యవహరిస్తున్నారు. రోజా విపక్షంలో ఉన్నపుడు కూడా అధినాయకత్వం అక్కడ వద్దు అని చెప్పి చూసింది అంటారు. ఇపుడు పార్టీ అధికారంలో ఉంది. పైగా రోజాకు ఎంతో కీలకమైన ఏపీఐఐసీ చైర్ పర్సన్ బాధ్యతలు అప్పగించారు. అయినా కూడా ఆమె జబర్దస్త్ ని వదలడంలేదు అన్న అసంతృప్తి అయితే వైసీపీలో ఉంది అంటున్నారు. రోజా మాత్రం తన వ్యక్తిగతం అది అంటున్నారు. మంత్రి పదవి ఇస్తే తాను వెంటనే జబర్దస్త్



వదిలేస్తాను అని ఆమె చెబుతున్నట్లుగా కూడా టాక్.ఆర్కే రోజా మీద అసలే కొన్ని ఫిర్యాదులు ఉన్నాయి. ఆమె హైదరాబాద్ లోనే ఉంటారు. చుట్టపు చూపుగా తన నగరి నియోజకవర్గానికి వస్తారు అంటారు. మరో వైపు ఆమె ఏపీఐఐసీ చైర్ పర్సన్ బాధ్యతలను కూడా పూర్తి స్థాయిలో నిర్వహించడంలేదు అంటున్నారు. వీటికి మించి జబర్దస్త్ షో లో ఆమె ఉండడం కూడా నచ్చడంలేదుట. బహుశా ఇవే ఆమెకు మైనస్ అవుతాయని అంటున్నారు. విస్తరణలో ఆర్కే రోజా పేరుని పరిశీలించాలన్నా కూడా ఆమె జబర్దస్త్ వైఖరే అడ్డుపడుతుంది అని కూడా విశ్లేషిస్తున్నారు. జగన్ ఎవరి విషయంలో అయినా ఒకసారే చెబుతారు అని ఆ మీదట తన యాక్షనే చూస్తారు అని వైసీపీలో అంటూంటారు. మంత్రి పదవికి జబర్దస్త్ కి ఆర్కే రోజా లంకె పెడితే అక్కడ జగన్ కూడా అలాగే ఆలోచిస్తారు కదా అన్న మాట ఉంది. మొత్తంగా ఈ జబర్దస్త్ రాజకీయంలో రోజమ్మ ఎలా నెగ్గుతుందో చూడాల్సిందే.

# వ్యూహకర్త కోసం జనసేనాని


హైదరాబాద్, మే 28, (న్యూస్ పల్స్) జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పట్లో పూర్తిస్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టే అవకాశాలు లేవు. ఆయనకు సినీ గ్లామర్ మీద నమ్మకం పోయిందంటున్నారు. ప్రజల్లో ఉంటేనే ఓట్లు రాలుతాయని గుర్తించారు. తాను ప్రస్తుతం పార్టీని నడిపేందుకు సినిమాలు చేస్తున్నప్పటికీ, పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి రాజకీయాలు చేయాలని భావిస్తున్నారు. అభిమానులు, సామాజికవర్గం ఓట్లు తనకు పెద్దగా విజయం సాధించిపెట్టలేవని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారు.ఇందుకోసం పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు వ్యూహకర్తను నియమించుకోవాలని డిసైడ్ అయ్యారంటున్నారు. ఇందుకోసం పేరున్న సంస్థలతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పోటీ చేయాల్సిన స్థానాలను ఈ సంస్థ డిసైడ్ చేయాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. తనకు క్షేత్రస్థాయి నుంచి వస్తున్న ఫీడ్ బ్యాక్ పై నమ్మకం లేదు. తన ఎదుట నేతలు వాస్తవ పరిస్థితిని వివరించడం లేదని తెలిసింది.దీంతో ఒక ప్రఖ్యాత ఆంగ్ల దినపత్రికతో పవన్ కల్యాణ్ ఒప్పందం చేసుకుంటారనే వార్తలు వినవస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వే చేసి జనసేనకు బలం ఉన్న ప్రాంతాలను ఈ సంస్థ గుర్తించి ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పాటు రాష్ట్రంలో ఏ యే నియోజకవర్గాల్లో వైసీపీ, టీడీపీ తర్వాత జనసేన బలంగా ఉంది? అక్కడ బీజేపీ బలం ఎంత? బీజేపీతో కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రయోజనం ఉంటుందా? తదితర విషయాలను ఈ సర్వేద్వారా పవన్ కల్యాణ్ తెలుసుకోవాలనుకుంటున్నారు.ఆ సర్వేల నివేదికను బట్టి అభ్యర్థుల ఎంపిక, పొత్తుల వంటివి ఉంటాయని జనసేన పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే గత ఎన్నికల్లో ఒక్క స్థానం సాధించి, తాను




రెండుచోట్ల పోటీ చేసి ఓడిపోయి పరువు పోగొట్టుకున్నారు. 2024 ఎన్నికల్లో అటువంటి ఫలితాలు రిపీట్ కాకుండా ఉండాలన్నది పవన్ కల్యాణ్ ఆలోచన. అందుకే ముందు జాగ్రత్త చర్యగా తన బలం ఎక్కడ? ఎంత? అన్న వివరాలను తెలుసుకుని వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు

# రఘురామ అరెస్ట్ తీరుపై ఎన్హెచ్ఆర్సీ సీరియస్


ఢిల్లీ: నర్సాపురం ఎంపీ రఘురామ అరెస్ట్ తీరుపై ఎన్హెచ్ఆర్సీ సీరియస్ అయ్యింది. ఏపీ డీజీపీ, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఎన్హెచ్ఆర్సీ నోటీసులు జారీ చేసింది. 4 వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. కస్టడీలో రఘురామపై పోలీసుల దాడికి సంబంధించి.. అంతర్గత విచారణ చేపట్టాలని ఆదేశాల్లో



పేర్కొంది. జూన్ 7లోగా నివేదిక డీజీని ఆదేశించింది. రఘురామ అరెస్ట్ తీరుపై ఎన్హెచ్ఆర్సీకి కుమారుడు భరత్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే, బెయిల్పై విడుదలైన ఎంపీ రఘురామ ఢిల్లీ ఎయిమ్స్లో చేరిన విషయం తెలిసిందే. అక్కడ ఆయన్ను కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎయిమ్స్ వైద్యులకు సూచించారు.

# ఎన్టీఆర్కు భారతరత్న ఇచ్చి గౌరవించాలి: అశోక్ గజపతిరాజు

విజయనగరం: దివంగత నందమూరి తారకరామారావుకు (ఎన్టీఆర్) భారతరత్న ఇచ్చి గౌరవించాలని, ఇందుకోసం కృషి చేయాలని టీడీపీ నేత, మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు పిలుపు ఇచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ కృషి చేశారని కొనియాడారు. వికేంద్రీకరణ, ఫెడరల్ వ్యవస్థ బలోపేతం



కోసం పనిచేశారన్నారు. నేషనల్ ఫ్రంట్తో కేంద్రంలో ప్రత్యామ్నాయం తీసుకువచ్చారన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు ఎన్టీఆర్ పెద్దపీట వేశారని, కిలో బియ్యం రూ.2కే ఇచ్చారని కొనియాడారు. రైతు రుణాలు రద్దు, రూ.50కే హార్స్ పవర్ కరెంట్ అందజేసిన ఘనత ఎన్టీఆర్దేనన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలని పెద్దలు చెబుతున్నా.. సీఎం జగన్ రెడ్డి ప్రాథమిక విద్యలో తెలుగును తొలగించడం బాధాకరమని అశోక్ గజపతిరాజు అన్నారు.

# బావిలో పడి వివాహిత మృతి

విశాఖపట్నం డుంబ్రిగుడ మండలంలోని కించుమండ పంచాయితీ పరిధిలో గల శుక్రపట్టు గ్రామ నివాసి అయినా దిసారి.రంభ(32)ప్రమాదవశాత్తు బావిలో వివాహిత మృతి చెందింది.పోలీసుల కథనం ప్రకారం...దిసారి.రంభ గొర్రెలను మేతకు తీసుకెళ్లి పక్కన ఉన్న బావి గట్టు పై కూర్చుంది.ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందింది.బాధిత కుటుంబీకులు గ్రామస్తులు నీటిపై తేలిన ఆమె మృతి దేహాన్ని బయటకు తీశారు.రంభకు ఐదుగురు పిల్లలు ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పరవాడ పోలీస్ స్టేషన్ కు మాస్కులు, శానిటైజర్ లు అందజేత

విశాఖపట్నం కరోనా మహమ్మారి సెకండ్ వేవ్ విజృంభిస్తున్న తరుణంలో రోజు రోజుకు కోవిడ్ పాజిటివ్ కేసులు ఎక్కువ అవుతున్నాయి. దీంట్లో భాగంగానే కరోనా నిర్మూలనకు లాక్ డౌన్ సమయంలో ఫ్రంట్ వారియర్స్ గా పనిచేస్తున్న పోలీసులుకు అచ్యుతాపురం ఏషియన్ పెయింట్స్ హెచ్ఆర్ మేనేజర్ శివప్రసాద్ పరవాడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ఉమామహేశ్వర రావు గారికి శుక్రవారం మాస్కులు, శానిటైజర్ లు అందజేశారు. ఈ సందర్భంగా సి ఐ ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని పోలీసులు లాక్ డౌన్ సమయంలో తమ విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. అలాగే తమ సిబ్బంది కరోనా మహమ్మారి బారి నుండి కాపాడేందుకు ఏషియన్ పెయింట్స్ వారు ఫ్రంట్ వారియర్స్ గా పనిచేస్తున్న పోలీసులను గుర్తించి మాస్కులు, శానిటైజర్ లు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఏషియన్ పెయింట్స్ హెచ్ఆర్ మేనేజర్ శివప్రసాద్ మాట్లాడుతూ సిబ్బందికి అవసరమైన ఎటువంటి సేవా కార్యక్రమాలు చేయడానికైన మా పరిశ్రమ ముందుంటుందని సి ఐ ఉమామహేశ్వర రావు గారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ రైటర్ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ 98 వ జయంతి వేడుకలు

నెల్లూరు తెలుగు ప్రజల ఆరాధ్య దైవం , తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 98వ జయంతి వేడుకలను జిల్లా టిడిపి నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని, తెదేపా జిల్లా కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూసమాజమే దేవాలయం,ప్రజలే దేవుళ్ళు అన్న నినాదం తో దేశ రాజకీయాలలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టిన మహనీయుడు ఎన్.టి.ఆర్ అని ఆయన సేవలను కొనియాడారు.అతి సామాన్యులకు, బలహీన వర్గాలకు చట్ట సభల్లో ఎన్.టి.ఆర్ అవకాశం కల్పించారు అని అన్నారు.నేడు తెలుగు రాష్ట్రాల్లో మంత్రులు గా, శాసన సభ్యులు గా, శాసన మండలి సభ్యులు గా, జెడ్పీ చైర్మన్ లు గా పలు హోదాల్లో వారు కొనసాగుతున్నారంటే అది ఎన్.టి.ఆర్ గొప్పదనమే అన్నారు.మహిళల కు ఆస్తి లో సమాన హక్కులు కల్పించి, వారి అభ్యున్నతి కోసం ఎంతో శ్రమించిన గొప్ప వ్యక్తి ఎన్.టి.ఆర్ అని పేర్కొన్నారు.ప్రాంతీయ పార్టీలను ఏకం చేసి ,కేంద్రం లో కాంగ్రెస్ యేతర కూటమి ఏర్పాటు చేసి ,జాతీయ స్థాయి రాజకీయాల్లో ఎన్.టి.ఆర్ కీలక భూమిక పోషించారు అని తెలిపారు. ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ ను జాతీయ స్థాయి లో అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ గా బలోపేతం చేసిన ఘనత ఎన్.టి.ఆర్ కే దక్కిందన్నారు.అధికారం లో ఉన్నా, లేకున్నా ప్రజలకు సేవ చేయడమే, తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని , ఎన్.టి.ఆర్ ఆశయాలను కొనసాగించడమే తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తల కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, నగర నియోజకవర్గ ఇన్చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

# పరవాడ పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు

విశాఖపట్నం పారిశ్రామిక ప్రాంతమైన పరవాడ మండలంలో వేళాపాల లేని విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరవాడ మండలంలో గత రెండు రోజులుగా విద్యుత్ కోతలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది పరిశ్రమల హబ్ గా అభివృద్ధి చెందుతున్న ప్పటికీ గృహ వినియోగదారులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. పారిశ్రామిక ప్రాంతంగా పిలవబడుతున్న పరవాడ మండలంలో ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ టి పి సి, ప్రైవేట్ రంగ సంస్థలైన జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ వంటి పరిశ్రమలు ఉన్నప్పటికీ గృహ వినియోగదారులు నిత్యం చీకట్లో జీవనం సాగించే వలసిందే. ఒకపక్క కరోనా మహమ్మారి తో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతుంటే మరోపక్క విద్యార్థులకు ఆన్లైన్ క్లాసులు కావటంతో ఫోన్లు చార్జింగ్ లేక, వేసవి ఉక్క పోతతో రాత్రులు నిద్ర లేక చిన్నపిల్లలు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే కరోనా కష్టకాలములో ఇలాంటి కరెంటు కోతలు విధించడం సరి కాదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే రాత్రులు విద్యుత్ కోతలు అధికంగా ఉండడంతో దోమ కట్లుకు ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ఇసిఎస్ అధికారులు వీటిపై దృష్టి సారించి కరెంటు కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే సబ్ స్టేషన్ ని ముట్టడిస్తామని గ్రామ ప్రజలు హెచ్చరించారు.

# పరవాడలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

విశాఖపట్నం పరవాడ మండలంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు 98వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణమూర్తి దంపతులు వారి స్వగృహం నందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరవాడలో బండారు అప్పలనాయుడు, పైల బుజ్జి, తానం గ్రామంలో మాజీ జెడ్పిటిసి పైల జగన్నాథరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, రావాడ గ్రామంలో వియ్యపు చిన్న భరణికం గ్రామంలో బొండా శని దేవుడు ఫార్మాసిటీలో అట్ట సన్యాసి అప్పారావు ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# టీటీడీపై సంచలన వ్యాఖ్యలు చేసిన గోవిందానంద సరస్వతి



తిరుపతి: టీటీడీపై గోవిందానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు చేశారు. టీటీడీ పుస్తకంలో అన్నీ తప్పులేనని తోచిపుచ్చారు. సంపూర్ణ అవగాహన, పరిశోధన చేయకుండా హనుమంతుడి జన్మస్థలాన్ని అసంపూర్ణ జ్ఞానంతో ప్రకటించారని తప్పుబట్టారు. టీటీడీ ప్రమాణంగా చూపిస్తున్న.. వెంకటాచలం మహత్యం సంకలనం తప్పుల తడక అని కొట్టిపారేశారు. వెంకటాచలం మహత్యం బుర్రలేని వారు రాశారని మండిపడ్డారు. ద్వాపరయుగం అంతంలో 5 వేల ఏళ్ల క్రితం పురాణాలు పుట్టాయని, టీటీడీ రామాయణాన్ని ప్రమాణంగా తీసుకోవడం లేదని గోవిందానంద విమర్శించారు. హనుమంతుడు పుట్టిన శ్లోకంతో తిధికి సంబంధం లేదన్నారు.కలియుగంలో హనుమంతుడు పుట్టినట్టు టీటీడీ పుస్తకం చెబుతోందని, టీటీడీ ప్రకారం హనుమంతుడు రాక్షసుడు.. రామాయణం ప్రకారం అప్సరస బిడ్డ అని తెలిపారు. అంజన హళ్లి ఇంకా పంపా సరోవరం వద్ద ఉందని పేర్కొన్నారు. రామాయణంలో ఎక్కడా తిరుమల గురించి వృషాద్రి, శేషాద్రి పర్వతాలు లేవని చెప్పారు. కొందరు కీర్తి కోసం వత్తిడితో హనుమంతుడి జన్మస్థలాన్ని.. పండితుల చేత రిలీజ్ చేయించారని ఆరోపించారు. టీటీడీ పండితులు దారి తప్పారని, తిరుమలను హనుమంతుడి జన్మస్థలం అని ప్రకటించాక.. టీటీడీకి లాయర్ నోటీసులు వెళ్లాయని గోవిందానంద తెలిపారు.

# ఆనందయ్య ముందుకు మార్కెట్లో డిమాండ్



విజయవాడ: ఆనందయ్య మందుపై జరుగుతున్న చర్చతో ఆయుర్వేదానికి డిమాండ్ వచ్చింది. కరోనా కల్లోలం సమయంలో క్షణాల్లో రోగం నయం చేసిన ఆనందయ్య పేరు రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగుతోంది. ఆయన వినియోగించిన ఆయుర్వేద వైద్యమే అందరికీ ఆదర్శంగా నిలిచింది. ప్రజల్లో కూడా నమ్మకం పెరగడంతో అంతా ఆ మందులకోసమే క్యూ కడుతున్నారు. ఆనందయ్య మందుకు మంచి డిమాండ్ ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో ఏ మూల విన్నా ఆనందయ్య ఆయుర్వేదం గురించే చర్చంతా.. ఇప్పుడు విజయవాడలో అదే ఊపు కనిపిస్తోంది. నగరంలో ఉన్న ఆయుర్వేద షాపుల్లో జోరుగా అమ్మకాలు సాగుతున్నాయి. కరోనాకు విరుగుడుగా ఆనందయ్య తయారు చేసిన మందు పంపిణీకి ప్రస్తుతానికి బ్రేక్ పడింది. అయితే రోగ నిరోధక శక్తిని పెంచే.. ఆ మందులో ఉపయోగించే వనమూలికలతో తయారైన బ్రాండెడ్ ఆయుర్వేద మందులకు ఇప్పుడు డిమాండ్ పెరుగుతోంది.

# బెంగాల్ లో మళ్లీ బై పోల్స్

కోల్ కత్తా, మే 28, (న్యూస్ పల్స్) పశ్చిమ బెంగాల్ లో మళ్లీ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికిప్పుడే ఎన్నికలు జరపలేమని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. అయితే మొత్తం ఐదు స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. పశ్చిమ బెంగాల్ లో ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే వివిధ కారణాలతో మరో ఐదు స్థానాల్లో ఉప ఎన్నికలు జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.పశ్చిమ బెంగాల్ లో ఇటీవల ఎన్నికలు జరిగాయి. 213 స్థానాలతో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే ఫలితాలకు ముందే మూడుస్థానాల్లో ఎన్నిక అనివార్యమయింది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఖర్దాహా స్థానం నుంచి టీఎంసీ భ్యర్థి కాజల్ సిన్హా గెలుపొందారు. అయితే ఆయన కరోనాతో మరణించారు. అలాగే ముర్షీదాబాద్ జిల్లాలోని జంగీపూర్ లో ఆర్ఎస్పీ అభ్యర్థి ప్రదీప్ నంది మరణించారు. దీంతో పాటు శంషేర్ గంజ్ స్థానంలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి మరణించారు. ఇక్కడ కూడా ఎన్నిక జరగాల్సి ఉంది.ఈ మూడు స్థానాలతో పాటు మరో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. బీజేపీ నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. వీరిద్దరూ 2019 లోక్ సభ ఎన్నికల్లో పార్లమెంటు సభ్యులుగా గెలిచారు. రాజ్ ఘాట్ నుంచి ఎంపీగా కొనసాగుతున్న జగననాథ్ సర్కార్, కూచ్ బెహార్ స్థానం నుంచి పార్లమెంటుకు గెలిచిన నిసీత్ ప్రామాణిక్ లు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.వారిద్దరూ తాము ఎంపీలుగానే కొనసాగాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర నాయకత్వం ఆదేశాను సారం వీరిద్దరూ తమ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తమకు ఎంపీలుగా కొనసాగాలని నిర్ణయించుకున్నామని వారు తెలిపారు. దీంతో మొత్తం ఐదు స్థానాల్లో పశ్చిమ బెంగాల్ లో ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. నందిగ్రామ్ లో మమత బెనర్జీ ఓటమి పాలు కావడంతో ఈ ఐదు స్థానాల్లో ఒక చోట నుంచి మమత బెనర్జీ పోటీ చేస్తారు. ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కరోనా తీవ్రత తగ్గిన తర్వాత ఎన్నికలు ఇక్కడ నిర్వహించే అవకాశముంది.

# కరోనా కాలంలో గుండె సమస్యలు రాకూడదా? దానికోసం ఈ చిన్న పని చేయండి ..



ప్రస్తుత అంటువ్యాధి గుండె సమస్య ఉన్నవారికి గొప్ప నొప్పిని కలిగిస్తోంది. కరోనా వ్యాప్తి చెందడం మొదలుపెట్టినప్పటి నుండి చాలా మంది గుండె జబ్బులతో మరణించారు. కరోనా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని తెలిసినప్పటికీ, అప్పటి నుండి ఇది శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని కనుగొనబడింది. ముఖ్యంగా కరోనా ఉన్నవారు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణిస్తున్నారు. అలాగే, గుండె జబ్బుతో బాధపడుతున్న చాలా మందికి గుండె సమస్య ఉన్నట్లు అనిపించదు. కాబట్టి ఈ కరోనా కాలంలో గుండెను ఆరోగ్యంగా ఉంచే ప్రయత్నాలలో పాల్గొనడం మంచిది. దాని కోసం మీరు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలి. అదనంగా శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. ఎందుకంటే ఊబకాయం గుండె సమస్యలను పెంచుతుంది. అలాగే డయాబెటిస్, అధిక రక్తపోటు మరియు కొన్ని క్యాన్సర్లకు దారితీస్తుంది. కాబట్టి ఆరోగ్యకరమైన హృదయాన్ని కాపాడుకోవడానికి ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు, సమతుల్య బరువును నిర్వహించడం కూడా చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడానికి రోజువారీ జీవితంలో చేర్చవలసిన కొన్ని ఆహారాలు క్రింద ఉన్నాయి. అర్జున చెక్క పౌడర్ అర్జున చెక్క పౌడర్ బెరడు శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉన్నందున అవి గుండెను రక్షించడంలో సహాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది గుండె కండరాన్ని కూడా బలపరుస్తుంది మరియు గుండె సజావుగా పనిచేస్తుంది. మరియు ఇది యాంటీ హైపర్టెన్సివ్ లక్షణాలను కలిగి ఉన్నందున, ఇది అధిక రక్తపోటును తగ్గిస్తుంది. శరీరంలోని విషాన్ని 7 రోజుల్లో పూర్తిగా తొలగించాలా? పొట్ట పూర్తిగా కరిగించాలా? దీన్ని తాగండి .శరీరంలోని విషాన్ని 7 రోజుల్లో పూర్తిగా తొలగించాలా? పొట్ట పూర్తిగా కరిగించాలా? దీన్ని తాగండి . గ్రీన్ టీ గ్రీన్ టీ గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్నందున, ఇది గుండె జబ్బులు మరియు ఇతర ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడగలదు. గ్రీన్ టీలో ముఖ్యంగా ఎపిగాల్లోకాటెచిన్ అనుషంగిక (ఇజిసిజి) ప్రధాన యాంటీఆక్సిడెంట్. ఇది ఆహార జీర్ణక్రియ నుండి ఉత్పన్నమయ్యే అనేక శారీరక ప్రక్రియలు మరియు విషాలకు వ్యతిరేకంగా పోరాడటానికి సహాయపడుతుంది. గ్రీన్ టీ టైప్ 2 డయాబెటిస్ మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని క్లినికల్ అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రాణాంతక ఎల్లో ఫంగస్(పసుపు ఫంగస్) ఎవరికి సోకుతుంది? దాని లక్షణాలు ఏమిటో మీకు తెలుసా? ప్రాణాంతక ఎల్లో ఫంగస్(పసుపు ఫంగస్) ఎవరికి సోకుతుంది? దాని లక్షణాలు ఏమిటో మీకు తెలుసా? పసుపు పసుపు భారతదేశంలో వండిన అన్ని వంటకాలకు పసుపు ప్రధాన మసాలా. ఈ పసుపులో కర్కుమిన్ అనే క్రియాశీల పదార్థం ఉంటుంది. ఈ మసాలాకు పసుపు రంగు ఇస్తుంది. ఇది గుండె కండరాన్ని రక్షించే శక్తివంతమైన లక్షణాలను కలిగి ఉంది. కర్కుమిన్ యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉందని వివిధ అధ్యయనాలు చూపించాయి. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కూడా కలిగి ఉంది. రక్తనాళాల సంకుచితం వల్ల గుండెపోటు వస్తుంది. పసుపు యొక్క శోథ నిరోధక లక్షణాలు రక్తనాళాలలో మంటకు వ్యతిరేకంగా పోరాడటానికి బాగా సహాయపడతాయి. కాబట్టి మీ రోజువారీ ఆహారంలో పసుపును చేర్చాలని నిర్ధారించుకోండి. కొన్ని ఆహారాలు కోడి గుడ్ల కన్నా ఎక్కువ పోషకమైనవి: కరోనా సమయంలో ఇవి తప్పనిసరిగా తినండి..కొన్ని ఆహారాలు కోడి గుడ్ల కన్నా ఎక్కువ పోషకమైనవి: కరోనా సమయంలో ఇవి తప్పనిసరిగా తినండి.. వెల్లుల్లి వెల్లుల్లి వెల్లుల్లి వివిధ సమస్యలకు చికిత్స చేయగల అద్భుతమైన పదార్థం. చెరువులో కార్బోహైడ్రేట్లలోనే కాకుండా పొటాషియం, ఫాస్పరస్, జింక్, విటమిన్ ఎ మరియు విటమిన్ బి కాంప్లెక్స్ వంటి పోషకాలు కూడా ఉన్నాయి. ఇటువంటి ఈ వెల్లుల్లి ఈజిప్టుకు పూర్వం నుండి ఉపయోగించబడింది.

## కోచ్‌ల సమ్మేళనంతో మెరుగైన ఫలితాలు: గోపీచంద్

న్యూఢిల్లీ: విదేశీ అత్యుత్తమ కోచ్‌లు, స్వదేశీ కోచ్‌ల కలయికతో అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అభిప్రాయపడ్డాడు. ద్వితీయ శ్రేణి విదేశీ కోచ్‌ల వల్ల అత్యుత్తమ ప్లేయర్లను తయారు చేయలేమని పేర్కొన్నాడు. హై పర్ఫార్మెన్స్ కోచ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా వర్చువల్ విధానంలో గురువారం జరిగిన భేటీలో పాల్గొన్న గోపీచంద్ మాట్లాడుతూ 'ప్లేయర్లను తీర్చిదిద్దే విషయంలో విదేశీ కోచ్‌ల పాత్ర చాలాకీలకం. కానీ అన్ని క్రీడల్లో వారి ప్రాతినిధ్యమే కాకుండా దేశీయ కోచ్‌లు కూడా తమ వంతు పాత్ర పోషిస్తే మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ఆస్కారం ఉంటుంది. మన కోచింగ్ పద్ధతిలో విదేశీ కోచ్‌లను సలహాదారులుగా నియమించుకుంటూ భారతీయులు నాయకత్వం వహిస్తే బాగుంటుంది. దీని వల్ల వారి నుంచి మరిన్ని మెళకువలు నేర్చుకునేందుకు అవకాశం లభిస్తుంది. భారత్ గెలువాలని స్వదేశీ కోచ్ ఎప్పుడూ కోరుకుంటాడు. అందుకనే మాజీ ప్లేయర్లను కోచ్‌లుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కోచ్‌లకు పూర్తి స్థాయి స్వేచ్ఛ , అధికారాలు కల్పిస్తే మరింత మందిని వెలుగులోకి తీసుకొస్తారు'అని అన్నారు.

# బాలీవుడ్ క్రేజీ ఆఫర్స్ అందుకుంటున్న సౌత్ హీరోయిన్స్..!



సినీ ఇండస్ట్రీలో హీరోయిన్స్ అనేవారు ఎప్పటికి ఫామ్ లోనే ఉంటారనే గ్యారంటీ లేదు. అలాగని అసలు ఫామ్ లోకి రారనేది కూడా లేదు. కానీ ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు హీరోయిన్స్.. హీరోలు.. ఆర్టిస్టులు ఇలా ప్రతి విషయంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇండస్ట్రీలో ఒక్కోసారి హీరోయిన్స్ కొరత కూడా కనిపిస్తుంది. అసలు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్స్ కరువు ఏంటనే సందేహం కలగవచ్చు. కానీ విషయం ఏంటంటే.. ఓ భాషలో హీరోయిన్స్ మరో భాషలో సినిమాలు చేయడం మాములు విషయమే. కానీ అసలు పరభాషా హీరోయిన్లను పిలవడానికి తమ ఇండస్ట్రీలో హీరోయిన్స్ లేరా అనిపిస్తుంది. అయితే స్టార్ హీరోయిన్స్ ఎవరి దారి వారు చూసుకున్నాక మిగిలిన హీరోలకు కూడా స్టార్ హీరోయిన్స్ కావాలంటే ఖచ్చితంగా వేరే ఇండస్ట్రీ వైపు లుక్కు వేయాల్సిందే.ప్రస్తుతం అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటుంది బాలీవుడ్ ఇండస్ట్రీ. బాలీవుడ్ ఇండస్ట్రీలో ఎంతోమంది హీరోయిన్స్ ఉన్నారు. కానీ వారందరిలో స్టార్డం కలిగిన హీరోయిన్స్ ఎంతమంది ఉంటారు. నిజానికి ఇండియా మొత్తం మీద హీరోయిన్స్ ఎక్కువగా ఉన్నటువంటి ఇండస్ట్రీ బాలీవుడ్ మాత్రమే. మరి అలాంటి ఇండస్ట్రీ ఇప్పుడు సౌత్ హీరోయిన్స్ వైపు దృష్టి పెడుతోంది. అంటే బాలీవుడ్ లో హీరోయిన్స్ కరువైనట్లే కదా అంటున్నాయి సినీవర్గాలు. బాలీవుడ్ లో ఉన్నటువంటి స్టార్ హీరోయిన్స్ అందరూ ఇప్పుడు చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నారు. మరికొందరు ఫామ్ లో లేరు. ఇలాంటి సమయంలో ఖచ్చితంగా ఓ సినిమాను జనాల్లోకి తీసుకెళ్లాలంటే స్టార్డం క్రేజ్ ఉన్నటువంటి హీరోయిన్స్ కావాలి. అందుకే ఇప్పుడు బాలీవుడ్ హీరోలు సౌత్ హీరోయిన్లకు పిలిచి మరీ అవకాశాలు ఇస్తున్నట్లు టాక్.అయితే కొత్తవాళ్లతో సినిమా చేస్తే రిస్క్ అవుతుందేమో అని మేకర్స్ కూడా క్రేజ్ ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీ సౌత్ లో స్టార్డం కలిగిన హీరోయిన్స్ పూజాహెగ్డే - రకుల్ ప్రీత్ సింగ్ - రష్మిక మందన - రెజినా లాంటి వారికీ అవకాశాలు కల్పించింది. ప్రస్తుతం వీరంతా సౌత్ లో స్టార్ హీరోయిన్స్ గా కొనసాగుతున్నారు. అయితే ప్రస్తుతం వీరి చేతిలో బాలీవుడ్ సినిమాలున్నాయి. పూజాహెగ్డే.. సల్మాన్ ఖాన్ - రన్వీర్ సింగ్ లతో సినిమాలు చేస్తుండగా.. రకుల్ ప్రీత్ సింగ్ మూడు సినిమాలు చేస్తోంది. అలాగే రష్మిక మందన హిందీలో రెండు సినిమాలు చేయనుండగా.. రెజినా కూడా పలు సినిమాల గురించి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. అలాగే వీరంతా తెలుగులో కూడా సినిమాలు చేస్తున్నారు. అయితే వీరందరిలో కూడా స్టార్ హీరోయిన్ పూజాహెగ్డే చేతిలోనే క్రేజీ ప్రాజెక్ట్స్ ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పూజా చేతిలో కబీ ఈద్ కబీ దీవాలి - సర్కస్ సినిమాలతో పాటు ప్రభాస్ రాధేశ్యామ్ - దళపతి సరసన ఓ సినిమాలున్నాయి. మొత్తానికి పూజా క్రేజ్ మాములుగా లేదుగా..!

# హీరో తప్పుతో తృటిలో ఆ ఇద్దరు ప్రాణాలు పోయేవి



హృతిక్ రోషన్ హిట్ మూవీ జిందగీ నా మిలేగీ దుబారా షూటింగ్ సమయంలో జరిగిన ఒక సంఘటనను అభయ్ డియోల్ వెల్లడించాడు. షూటింగ్ సమయంలో అభయ్ డియోల్ మరియు ఫర్హాన్ అక్తర్ లు తృటిలో ప్రాణాలతో బయట పడ్డారు. హృతిక్ రోషన్ తప్పు వల్ల ఆ రోజు ప్రమాదం జరుగబోతుంది.. ఆయనే సమయస్ఫూర్తితో స్పందించడంతో వారిద్దరు కాపాడబడ్డారు. ఈ సీరియస్ ఫన్నీ సంఘటన గురించి అజయ్ డియోల్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. ప్రస్తుతం ఈ విషయం బాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అసలు విషయం ఏంటీ అంటే హృతిక్ రోషన్ షూటింగ్ లో భాగంగా కారు డ్రైవ్ చేస్తూ ఉంటాడు. ఆయన వెనుక సీటులో అభయ్ మరియు ఫర్హాన్ లు కూర్చుని ఉన్నారు. కారు స్పీడ్ గా తీసుకు వచ్చి రోడ్డు పక్కన నిలిపి వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత స్పీడ్ గా కారు నుండి హృతిక్ దిగాల్సి ఉంటుంది. ఇది సీన్... దీనిని చిత్రీకరిస్తున్న సమయంలో హృతిక్ రోషన్ అంతా అనుకున్నట్లుగానే చేశాడు కాని కారు దిగే ముందు హ్యాండ్ బ్రేక్ వేయడం మర్చి పోయినట్లుగా ఉన్నాడు. దాంతో డౌన్ ఉండటంతో మెల్లగా ఒక లోతైన లోయలోకి కారు పడబోతుంది.కారు ముందుకు వెళ్తున్న విషయం గమనించి వెంటనే హృతిక్ రోషన్ కారు బ్రేక్ తొక్కి పట్టాడు. అదే సమయంలో వెనుక సీటులో ఉన్న అభయ్ మరియు ఫర్హాన్ లు క్షణాల్లో కిందకు దిగేశారు. ఇది అంతా కూడా షూటింగ్ చేస్తున్నారు కనుక రికార్డ్ అయ్యింది. అప్పటి ఈ వీడియోను ఇప్పుడు అభయ్ షేర్ చేశాడు. హ్యాండ్ బ్రేక్ వేయక పోవడంతో కారు ముందుకు మూవ్ అయ్యింది. వెంటనే హృతిక్ స్పందించాడు. లేదంటే కారు లోయలో పడిపోయేది ఇద్దరు కూడా మృతి చెందే వారు. ఇది ఇప్పుడు ఫన్నీగా అనిపిస్తున్నా ఆ సమయంలో వారిద్దరికి గుండె జారి పాయింట్ లోకి వచ్చి ఉంటుంది.

# ఆ రెండు ప్రూఫ్ లతో ఆక్సిజన్ కోసం సంప్రదించాలి

చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఇరు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో ఆక్సిజన్ బ్యాంకుల్ని ఏర్పాటు చేసి కరోనా రోగులను అత్యవసరంలో ఆదుకుంటున్న సంగతి తెలిసిందే.



ఆయా జిల్లాల అభిమాన సంఘాల అధ్యక్షులు వీటిని నిర్వహిస్తుండగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పర్యవేక్షిస్తున్నారు.కచ్చితంగా ఆక్సిజన్ అవసరం ఉన్న రోగుల్ని ఆదుకునేందుకు ప్రతిదీ మానిటర్ చేస్తున్నారు. చిరంజీవి ట్రస్ట్ ఆక్సిజన్ బ్యాంక్ ల నుంచి ఆక్సిజన్ అందాలంటే .. రోగుల కుటుంబీకులు డాక్టర్ లెటర్ ని ఖీ ఖఅఖీ టెస్ట్ రిపోర్ట్ తో సంబంధిత జిల్లా శాఖ కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుంది. రోగి కుటుంబీకులకు ఆక్సిజన్ సిలిండర్లను రెగ్యులేటర్స్ తో అందిస్తారు.నిన్నటిరోజున అనంతపురం గుంటూరు జిల్లాలకు ఆక్సిజన్ సిలిండర్లను పంపిన సంగతి తెలిసిందే. నేడు మరిన్ని జిల్లాలకు ఆక్సిజన్ సరఫరా ఉంటుంది. తెలంగాణ జిల్లాలకు సరఫరాకు ఏర్పాట్లు సాగుతున్నాయి. శరవేగంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. అనునిత్యం వందలాది ఆక్సిజన్ సిలిండర్లు అన్ని జిల్లాల హెడ్ క్వార్టర్స్ కి పంపించేలా మెగాస్టార్ అనుయాయులు ఆఫీస్ సిబ్బంది హైదరాబాద్ బ్లడ్ బ్యాంక్ నుంచి ప్రతిదీ మానిటర్ చేస్తుండడం విశేషం.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**